ప్రమాదం అంచున ప్రయాణం..

- ఎన్గల్ శివారులో కొట్టుకుపోయిన రోడ్డుకు మరమ్మతులు కరువు
- పట్టించుకోని అధికారులు
- మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి



ఎన్గల్ శివారులో కొట్టుకుపోయిన ఆర్‌అండ్‌బీ రోడ్డు

చందుర్తి: రెండునెలల క్రితం కురిసిన భారీ వర్షానికి కొట్టుకుపోయిన ఆర్‌అండ్‌బీ రోడ్డుకు రెండు నెలలుగా మరమ్మతులు కరువయ్యాయి. వేములవాడ నుంచి నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలకేంద్రానికి ప్రధాన రహదారి అయిన మండలంలోని ఎన్గల్ శివారు ఆర్‌అండ్‌బీ రోడ్డు మే 25 కురిసిన భారీ వర్షానికి వరద ఉధృతికి రోడ్డు కోతకు గురైంది. రోడ్డు కొట్టుకుపోయిన ప్రాంతంలో ప్రమాదాలు జరగకుండా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటివరకు ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టలేదని ప్రజలు వాపోతున్నారు. మిగిలిన మూడున్నర మీటర్ల రోడ్డుపై భారీ వాహనాలు కొంచెం అటు, ఇటుగా పోయిన వాహనాలు వంతెన కిందపడే ప్రమాదం ఉంది. ఇదంతా తెలిసినా అధికారులకు పట్టింపు కరువైందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తించి మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఏటా ఇవే తిప్పలు

ఏటా వర్షాకాలంలో ఈ రోడ్డు కొట్టుకుపోవడం షరా మామూలైంది. వంతెన కింద ఉన్న పైపుల వద్ద చెత్త, చెదారం నిండి పైపుల్లో నుంచి నీరు వెళ్లక రోడ్డుపై నుంచి వరదనీరు ఉధృతిగా ప్రవహించడంతో ఈప్రాంతంలో రోడ్డు నాలుగేళ్లుగా కొట్టుకుపోతూనే ఉంది. తాత్కలిక మరమ్మతులతో అధికారులు చేతులు దులుపుకుంటున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఏటా మరమ్మతుల పేరిట రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేస్తున్నా ప్రయోజనం లేకుండా పోతోందని ఎన్గల్ వాసులు తెలుపుతున్నారు. వర్షాకాలానికి ముందు వంతెనకు ఇరువైపులా ఉన్న చెత్తా చెదారాన్ని తొలగిస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదని వాపోతున్నారు. లేదంటే శాశ్వత పరిష్కారం చేపడితే ఇబ్బందులు ఉండవని ప్రయాణికులు భావిస్తున్నారు.

పట్టింపు కరువు



రోడ్డ నిర్వహణపై ఆర్‌అండ్‌బీ అధికారులకు పట్టింపు కరువైంది. మూడేళ్ల క్రితం తారువేసి సైడ్ బర్మ్స్ పోయించడం మరిచారు. దీంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉపాధిహామీలో రోడ్డు నిబంధనలకు విరుద్ధంగా మొక్కలు నాటడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. – మ్యాకల జలేందర్, ఎన్గల్

ఏటా ఇదే పరిస్థితి



ఏటా వర్షాకాలంలో భారీగా వర్షాలు కురిస్తే రోడ్డు కొట్టుకుపోతోంది. ఈ పనులు పూర్తిస్థాయిలో చేయించడంలో అధికారులు, పాలకులు విఫలమవుతున్నారు. వంతెన నిర్మాణ సమయంలో పైపులు వేయడంతో వర్షపు నీరు ప్రవహించకపోడవంతో నీరంతా రోడ్డుపై ప్రవహించి కోతకు గురవుతుంది. – కుసుంభ జనార్ధన్ మాజీ ఉపసర్పంచ్, ఎన్గల్

వర్షాలు తగ్గగానే మరమ్మతులు

"రోడ్డు కొట్టుకుపోయిన ప్రాంతంలో రెండు టిప్పులు మట్టి పోయించాం. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపడుదామంటే వర్షాలు పడడంతో పనులు నిలిపివేశాం. వర్షాలు తగ్గుముఖం పట్టగానే మట్టి పోయించి మరమ్మత్తులు పూర్తిచేస్తాం. – నవ్యశ్రీ, ఆర్‌అండ్‌బీ ఏఈ, చందుర్తి"

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ముస్తాబాద్: మండలంలోని నామాపూర్ ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నర్సింహరాజు తెలిపారు. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఖాళీగా ఉన్న సీట్లకోసం విద్యార్థులు సంప్రదించాలన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

వేములవాడఅర్బన్: పట్టణంలోని శాత్రాజుపల్లి రోడ్డు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో దోస్త్ 2025–26లో స్పెషల్ ఫేజ్, స్పాట్ అడ్మిషన్ల షెడ్యూల్ విడుదల అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ లావణ్య ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు వివిధ గ్రూపుల్లో ఎస్సీ సీట్లు ఉన్నందున ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 25 నుంచి 31 వ రకు సంబంధిత ధ్రువపత్రాలతో నేరుగా కళాశాలకు వచ్చి ప్రవేశం పొందాలని తెలిపారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న చింతోజు భాస్కర్

సిరిసిల్లటౌన్: ప్రమాదవశాత్తు మృతిచెందిన వినియోగదారుడి కుటుంబానికి రూ.లక్ష చెక్కును సిరిసిల్ల గాయత్రీ బ్యాంకు మేనేజర్ శుక్రవారం అందజేశారు. ఖాతాదారుడు ఉప్పుల శ్రీకాంత్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందాడు. గాయత్రి నిర్భయ సేవింగ్ ఖాతాపై ప్రమాదబీమా సౌకర్యం ద్వారా నామిని అయిన తల్లి ఉప్పుల గౌరవ్వకు రూ.లక్ష చెక్కును మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చింతోజు భాస్కర్ చేతులమీదుగా అందజేశారు. ఇక్కడ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ సమ్మెట శ్రీనివాస్, సీనియర్ ఆఫీసర్ చిగురు శ్రీకాంత్, జూనియర్ ఆఫీసర్ జగ్గాని శరత్ పాల్గొన్నారు.

కేసీఆర్ కిట్లు పంపిణీ



పెద్దూరు తొమ్మిదో వార్డులో కేసీఆర్ కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

సిరిసిల్ల అర్బన్: మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకల సందర్భంగా పట్టణ పరిధిలోని పెద్దూరు, జెగ్గారావుపల్లె గ్రామాల్లోని 8,9వ వార్డుల్లో కేసీఆర్ కిట్లను మాజీ కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఎర్రవెల్లి వెంకటరమణారావు, ఎనిమిదో వార్డు అధ్యక్షుడు మిడుదుల దేవయ్య, తొమ్మిదో వార్డు అధ్యక్షుడు షేక్ అలీ, మాజీ సర్పంచ్ దేవగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని పెద్ద లింగాపూర్‌లో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్ కిట్లు అందజేశారు. మాజీ సర్పంచ్ జితేందర్ గౌడ్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బొప్ప శ్రీనివాస్, మాతిరెడ్డి కిషన్‌రెడ్డి, అనిల్‌కుమార్, రమేశ్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చూపు బీజేపీ వైపే



ఇల్లంతకుంట: రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రజల చూపు బీజేపీ వైపే ఉందని రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు బీజేపీ మండల ఇన్‌చార్జి నాయకుడు అడిచెర్ల రాజు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ మండల కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రజలు కాంగ్రెస్ మాటలు నమ్మే పరిస్థితిలో లేరని, గ్రామాలు, మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతుందన్నారు. కార్యకర్తలు పార్టీ అభ్యర్థులను గెలుపునకు కృషి చేయాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు భూమల్ల అనిల్‌కుమార్, బత్తిని సాయిగౌడ్, నాగసముద్రాల సంతోష్, మల్లేశం, శ్రీనివాస్, కొలనూరు ముత్తవ్వ, తిరుపతిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఢిల్లీలో జిల్లా బీసీ నేతలు

వేములవాడ: ఢిల్లీలోని తాల్కటోర స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ ఓబీసీ నేతల సమావేశంలో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, బీసీ మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, కొండా సురేఖ, బీసీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ పార్టీ బీసీ ముఖ్య నేతలతో కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



వీర్నపల్లి: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నట్లు సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం అన్నారు. రంగంపేటలో ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సెస్ ఏడీఈ శ్రీనివాసులు, ఏఈఈ నాగుల రమేశ్, రైతులు పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమం పట్టించుకోని ప్రభుత్వం



ఎల్లారెడ్డిపేట : మాట్లాడుతున్న లక్ష్మణ్

ఎల్లారెడ్డిపేట: వికలాంగులు, వితంతువులు, బీడీ కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ అన్నారు. మండలంలోని రాచర్లగొల్లపల్లిలో శుక్రవారం వికలాంగులు, బీడీ కార్మికులు, ఆటో కార్మికులు, వితంతువులతో లక్ష్మణ్ సమావేశం నిర్వహించారు. ఈ నెల 27న సిరిసిల్లలో చేపట్టిన బహిరంగ సభకు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. బహిరంగ సభకు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు తెలిపారు. పలుగ్రామాల వికలాంగులు, వితంతువులు, జోగినిలు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

కోనరావుపేట: ఈనెల 27న జిల్లాకేంద్రంలో నిర్వహించే వికలాంగుల, చేయూత పింఛన్‌దారుల సింహగర్జన సన్నాహక సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ము రాజశేఖర్ కోరారు. మండలంలోని కొలనూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఆగస్టు 13న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో వికలాంగుల, పింఛన్‌దారుల సింహగర్జన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు ఈనెల 27న సిరిసిల్లలో సన్నాహక సదస్సును ఏర్పాటు చేస్తున్నామని, కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరవుతున్నారన్నారు. వీహెచ్‌పీఎస్ నాయకులు వాల్యానాయక్, బాలచందర్, మన్‌మోహన్, ఆశయ్య, విజయ్, వికలాంగులు, పింఛన్‌దారులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: దివ్యాంగులు, ఆసరా పింఛన్ లబ్ధిదారుల హక్కుల సాధనకు తలపెట్టిన చలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు పెద్దఎత్తున తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి సడిమెల శోభరాణి, వీహెచ్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి జిల్లా కన్వీనర్ దేవరాములు అన్నారు. మండలకేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. దివ్యాంగులు, పెన్షన్‌దారుల హక్కుల సాధన బహిరంగ సభను సిరిసిల్లలో ఈనెల 27న నిర్వహిస్తున్నారన్నారు. సమావేశంలో సుంచు మల్లయ్య, ముక్క మల్లయ్య, శేఖర్, నాయకులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు పంపిణీ



రేషన్‌కార్డులు అందజేస్తున్న నాయకులు

ముస్తాబాద్: అర్హులైన పేదలకు ఆహార భద్రత కల్పించడమే కాంగ్రెస్ లక్ష్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని మోహినికుంటలో రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పదేళ్ల అధికారంలో ఉన్న గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం అందిస్తూ పేదలందరికీ రేషన్‌కార్డులు ఇచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు. మాజీ జెడ్పీటీసీ మెరుగు యాదగిరిగౌడ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అనిత, సతీశ్ గౌడ్, లక్ష్మిపతి, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ కనెక్షన్ మంజూరుపై హర్షం

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట జెడ్పీహెచ్ఎస్‌కు గ్యాస్ కనెక్షన్ మంజూరు చేయడంపై మధ్యాహ్న భోజన నిర్వాహకులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. హన్మాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం తనిఖీ చేయగా కట్టెల పొయ్యిపై వంట చేయడాన్ని గుర్తించారు. వెంటనే ఆ పాఠశాలకు గ్యాస్ కనెక్షన్ మంజూరు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం పాఠశాలకు గ్యాస్ కనెక్షన్ అందజేశారు. దీంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు గ్యాస్ స్టవ్ పైనే వంటలు చేశారు.

పోగొట్టుకున్న పర్సు అందజేత

వేములవాడఅర్బన్: చందుర్తి మండలం బండపల్లికి చెందిన లక్ష్మి వేములవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం పర్సు పోగొట్టుకోగా కార్మికులకు దొరికింది. కంట్రోలర్‌కు పర్సు అప్పగించగా ఆధార్‌కార్డు ఆధారంగా లక్ష్మికి ఫోన్‌చేసి అందజేశారు. పర్సులో ఆధార్‌కార్డు, రూ. 500 ఉన్నట్లు తెలిపారు. పీఆర్వో శ్రీనివాస్, సెక్యూరిటీ గార్డు తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

• ఎరువుల దుకాణాల్లో తనిఖీ

వేములవాడఅర్బన్: పట్టణంలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం వ్యవసాయ అధికారులు తనిఖీ చేశారు. ఎరువుల విక్రయ లైసెన్స్ లేకుండా వ్యవసాయినికి సంబంధించిన ఎరువుల ప్రొడక్ట్ ప్యాకెట్లతో అమ్ముతున్నందున గుర్తించి సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం మాట్లాడుతూ... అనుమతులు లేకుండా ఎరువులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాస్, ఏవో సాయి కిరణ్ తదితరులున్నారు.

ఇల్లంతకుంట: ముస్కానిపేటలో ఫర్టిలైజర్ షాపును మండల వ్యవసాయ అధికారి సురేశ్‌రెడ్డి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి స్టాక్ వివరాలు తెలుసుకున్నారు.

• సన్మానం

సిరిసిల్ల అర్బన్: మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తంను శుక్రవారం సిరిసిల్లలో మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికై మొదటిసారి వేములవాడలో నిర్వహిస్తున్న మున్నూరుకాపు రాష్ట్రస్థాయి సమావేశానికి హాజరుకానున్న సందర్భంగా సిరిసిల్లలో ఆయనకు ఘనస్వాగతం పలికి సన్మానించారు. అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేశారు. మున్నూరుకాపు పట్టణ అధ్యక్షుడు ఒజ్జల అగ్గిరాములు, జిల్లా ప్రచార కార్యదర్శి బాల్‌రెడ్డి, గడ్డం నర్సయ్య, ఆకుల చిన్న, తదితరులు పాల్గొన్నారు.


• సిలిండర్లు పంపిణీ

ఇల్లంతకుంట: రేపాక హైస్కూల్‌లో శుక్రవారం గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. పలుగ్రామాల్లో 37 ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన కార్మికులకు సిలిండర్లు పంపిణీ పూర్తయిందని మండల విద్యాధికారి చెప్పాల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

• అన్నదానం

వేములవాడ: అన్నదానం మహాదానమని సీనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్ జాదవ్ అన్నారు. అడ్వకేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో జూనియర్ ఈసీ మెంబర్ గుడిపెల్లి మహేశ్ జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అసోసియేషన్ అధ్యక్షుడు గుండ రవి, ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు, పాల్గొన్నారు.

• వివాహిత అదృశ్యం



అఖిల

చందుర్తి: మండలంలోని ఆశిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గంట్యాల అఖిల గురువారం ఉదయం వేములవాడకు వెళ్లి కిరాణ సామగ్రి తీసుకొస్తానని పిల్లల్ని ఇంటి వద్ద వదిలివెళ్లింది. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో అత్త నర్మద ఫోన్‌చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువులు, తెలిసిన చోట వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త శ్రీనివాస్ ఉపాధి కోసం దుబాయ్ వెళ్లారు. అఖి ల అత్త నర్మద శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై జిల్లెల రమేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

మహాసభల కరపత్రాల ఆవిష్కరణ

వీర్నపల్లి: మండలకేంద్రంలో బీడీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జిల్లా మహాసభల కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ప్రజాసంఘాల నాయకులు మల్లారపు అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. 27న సిరిసిల్ల పట్టణంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘంలో బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ సీటీటీయూ జిల్లా మహాసభలు జరుగుతున్నాయని, జిల్లా నలుమూలల నుంచి బీడీ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ముఖ్య అతిథిగా బీడీ వర్కర్స్ యూనియన్ సీటీటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్ రమా, రాష్ట్ర అధ్యక్షుడు గోపాలస్వామి హాజరుకానున్నట్లు తెలిపారు. బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. బీడీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్లు తొలగింపు



తంగళ్లపల్లి: విద్యుత్ బకాయిలు చెల్లించని వినియోగదారుల విద్యుత్ కనెక్షన్లు నిబంధనల మేరకు తొలగిస్తున్నట్లు తంగళ్లపల్లి సెస్ ఏఈ మధుకర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సకాలంలో విద్యుత్ బకాయిలు చెల్లించి సంస్థకు సహకరించాలని కోరారు. శుక్రవారం మండలకేంద్రంలో పలువురు బకాయిలున్న వినియోగదారుల విద్యుత్ కనెక్షన్లు తొలగించినట్లు తెలిపారు. విద్యుత్ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సెస్ సిబ్బంది, తదితరులున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



బోయినపల్లి: మండలకేంద్రం నుంచి కొదురుపాక వెళ్లే రోడ్డులో పెట్రోల్ బంక్ వద్ద ఉన్న లో లెవల్ కల్వర్టుపై పలుచోట్ల గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయని సీపీఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ పేర్కొన్నారు. కల్వర్టుపై ఉన్న గుంతలతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని శుక్రవారం తెలిపారు. రాత్రిపూట కల్వర్టుపై వెళ్లాలంటే ప్రయాణికులు జంకుతున్నారని, మరమ్మతులు చేపట్టాలని రామంచ అశోక్ ఉన్నారు.

పుస్తకాల గది సీజ్



ఎల్లారెడ్డిపేటలో పుస్తకాల గదిని సీజ్ చేస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల యజమాన్యం అక్రమంగా పాఠ్య పుస్తకాలు విక్రయిస్తుండగా, ఎమ్మార్వో అధికారులు శుక్రవారం పుస్తకాల గదిని సీజ్ చేశారు. పాఠశాల యజమాన్యం అక్రమంగా పుస్తకాలను ఓ గదిలో నిల్వచేసి అధిక ధరలకు విద్యార్థులకు విక్రయిస్తున్నాన్న సమాచారం మేరకు డెమొక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు గాంతుల మహేశ్ విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. పుస్తకాల గది వద్ద ఆందోళన చేశారు. దీంతో ఎంఈవో కృష్ణహరితో పాటు అధికారులు పుస్తకాల గదిని పరిశీలించారు. అందులో ఎలాంటి అనుమతులు లేకుండా పాఠ్య పుస్తకాలు విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు నిర్ధారణ కావడంతో పుస్తకాల గదిని సీజ్ చేసినట్లు ఎంఈవో తెలిపారు. ఈ విషయంపై జిల్లా విద్యాధికారికి నివేదిక ఇస్తామన్నారు.



గంభీరావుపేట : గంభీరావుపేట మండలకేంద్రంలోని దోసెలగూడెం కాలనీలో బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెట్లపొదలు, తీగలతో అల్లుకుంది. ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరికి వెళ్లేందుకు వీలు లేకుండా పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. అధికారులు చర్యలు తీసుకొని పిచ్చి మొక్కలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : ఆనంద్ కుమార్
సెస్ ఏఈ, గంభీరావుపేట, సెల్ : 94408 14082

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

మున్నూరుకాపులు రాజకీయంగా ఎదగాలి



సమావేశమైన మున్నూరు కాపులు

గంభీరావుపేట: మున్నూరు కాపులు రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలని నాయకులు పేర్కొన్నారు. మండలంలోని పొన్నాలపల్లెలో మండల మున్నూరుకాపుల సమావేశం శుక్రవారం జరిగింది. మున్నూరుకాపులు ఐక్యంగా ఉంటూ హక్కులు సాధించుకోవాలని తీర్మానించారు.ఇందుకు అడ్‌హక్ కమిటీని ఎన్నుకున్నారు. త్వరలో మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు అడ్‌హక్ కమిటీ కృషి చేస్తుందన్నారు. ఆగస్టు 2 నుంచి 3 వరకు సంఘం ఎన్నికలకు నామినేషన్లు ఉంటాయన్నారు. సమావేశంలో అడ్‌హక్ కమిటీ సభ్యులు కొమిరిశెట్టి లక్ష్మణ్, గంధ్యాడపు రాజు, పొన్నాల హన్మండ్లు, ఎర్ర నర్సయ్య, కాస శ్రీనివాస్, గ్యాద రాములు తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్ అనుమతుల రద్దుపై సంబరాలు



పటాకులు కాలుస్తున్న గ్రామస్తులు

వేములవాడరూరల్: వేములవాడ మండలం మర్రిపల్లి శివారులోని మారుతి రైస్‌మిల్లు అనుమతులను కలెక్టర్ రద్దు చేస్తూ ఉత్తర్వుల జారీచేయడంతో శుక్రవారం గ్రామస్తులు సంబరాలు జరిపారు. సర్వే నంబర్‌లో 750 మల్లయ్య కుంటను ఆక్రమించి రైస్‌మిల్ యజమానులు నిర్మాణం చేపట్టారు. గ్రామస్తులు, మాజీ ఎంపీటీసీ వీరారెడ్డి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన జిల్లా అధికారులు మిల్లుకు ఇచ్చిన అనుమతులు రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏళ్లుగా ఈ మిల్లు పక్కన పంటపొలాలు సాగు చేస్తున్న రైతులు మిల్లు నుంచి వెదజల్లుతున్న దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై గతంలో పలుసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. గ్రామస్తుల ఫిర్యాదుతో కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని విచారణ చేపట్టారు. మిల్లు అనుమతులు రద్దు చేయడంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తూ పటాకులు కాల్చి కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రద్దు కానున్న మరో రెండు మిల్లులు..!

వేములవాడ పట్టణంతో పాటు రూరల్ మండలాల్లో నిర్మించిన మరో రెండు మిల్లులకు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిసింది. మున్సిపల్ నిబంధనలు, మిల్లు నిబంధనలకు విరుద్ధం నిర్మాణం చేపట్టినట్లు అధికారులు గుర్తించారు. వారికి కొద్ది రోజుల్లో అనుమతులు రద్దుచేస్తూ నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిసింది. దీంతో ఇతర మిల్లు యజమానుల్లో గుబులు మొదలైంది.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఎల్లారెడ్డిపేట: వర్షాకాలంలో రైతులు పొలాల వద్ద విద్యుత్ మోటార్లను ఆన్‌చేసే విషయంలో జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని సెస్ ఏఈఈ పృథ్వీధర్‌గౌడ్ కోరారు. మండలకేంద్రంలోని సెస్ కార్యాయలంలో శుక్రవారం ఏఈఈ మాట్లాడారు. తడి చేతులతో స్విచ్ బోర్డులను ముట్టవద్దని, వర్షం పడుతున్నప్పుడు కరెంట్ పరికరాల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఉరుములు, మెరుపులు వచ్చినప్పుడు విద్యుత్ పరికరాలను చేతితో తాకవద్దన్నారు. విద్యుత్ మోటార్ల వద్ద స్టార్టర్లను ఏదైనా కర్రతో తెరవాలన్నారు.

కురుమ సంఘం కమిటీ ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గం

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం కురుమ సంఘం ఎన్నికలు శుక్రవారం జరిగాయి. మండల కురుమ సంఘం కమిటీ అధ్యక్షుడిగా దానే తిరుపతి, ఉపాధ్యక్షుడిగా ఎగుర్ల రాజు, ప్రధాన కార్యదర్శిగా గుంటి వంశీకృష్ణ, సహాయ కార్యదర్శిగా ఇరుమళ్ల మల్లేశం, కోశాధికారిగా కట్టె బాలకిషన్, సలహాదారుగా కోరే తిరుపతి, కార్య నిర్వాహక సభ్యులుగా నాగరాజు, జక్కుల తిరుపతి, ఎగుర్ల రాజు, గుంటి కనకయ్య, బైరి హనుమయ్య, ముత్తా రజిత, ఇరుమళ్ల పవిత్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పట్టణ కురుమ సంఘం అధ్యక్షుడిగా బాలరాజు

వేములవాడఅర్బన్: పట్టణ కురుమ సంఘం అధ్యక్షుడిగా ఈరు బాలరాజును ఏకగ్రీవంగా నియమించారు. ఉపాధ్యక్షుడిగా కృష్ణను నియమించారు. నాయకులు ఎనుగుల కనుకయ్య, నాగం కుమార్, జక్కుల తిరుపతి, నాగరాజు, కనుకయ్య, కోరె రవి, మ్యాకల శ్రీనివాస్, మల్లేశం తదితరులు ఉన్నారు.

విద్యార్థికి అభినందన

సిరిసిల్ల ఎడ్యుకేషన్: నవోదయలో సీటు సాధించిన నెహ్రూనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థి కోడెం ప్రేమ్‌ను ప్రధానోపాధ్యాయుడు గణేశ్ అభినందించారు. ఉపాధ్యాయులు ప్రవళిక, చందన, కరుణ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కోనరావుపేట : నిజామాబాద్‌లో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లి, నిజామాబాద్, కోనరావుపేట, కొలనూర్‌లో శుక్రవారం సీజనల్ వైద్య శిబిరాలు నిర్వహించారు. మండల వైద్యాధికారి వేణుమాధవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాల్లో ఫీవర్ సర్వే నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. సీహెచ్‌వో కృష్ణమూర్తి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని తాళ్లపల్లిలో ఉచిత గుండె వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. శిబిరంలో పేషెంట్లకు షుగర్ బీపీ ఈసీజీ 2డీఈకో పరీక్షలు నిర్వహించారు. కోట కరుణాకర్, లక్ష్మీ రాజం, శ్రీకాంత్ ,తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాతో ఖర్చులు ఆదా

కోనరావుపేట: నానో యూరియాతో రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు మేలు జరుగుతుందని మండల వ్యవసాయాధికారి సందీప్ అన్నారు. మండలకేంద్రంలోని రైతువేదికలో నానో యూరియా వాడకంపై ఎరువుల డీలర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నానో యూరియా ద్వారా పంటల దిగుబడులు 8 శాతం పెరిగే అవకాశం ఉందన్నారు. అన్ని గ్రామాల్లోని రైతులు వినియోగించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల విత్తన ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.